చెప్పేడు మన్మథరావు. అయిదేళ్ల కిందట ఆ లైబ్రరీలో చూసేడు మన్మథరావు ఆ పుస్తకం. "జొన్నసేను కాడ సిన్న దానిని జూచి నిన్నటేల నుండి నిదరనేదు" అన్నట్టుగా బాధపడుతూ వుండగా ఆ లైబ్రరీకి అధికారిగా ఇతని ఫ్రెండు విశ్వనాథరావు వచ్చేడు. విశ్వనాథరావు పలుకుబడి వుపయోగించి ముందు ఆ సావనీర్ (లైబ్రరీ రిజిస్టర్ 81వ పేజీలో సంతకం పెట్టి అతని చేత కూడా పెట్టించి) ఇంటికి తెచ్చేడు. రెండేళ్ళ కిందట విశ్వనాథరావు ట్రాన్స్‌ఫర్ అయినప్పుడు మన్మథరావు అతనికి వీడ్కోలు చెప్పడానికి అక్కడికి వెళ్లి "అన్నట్టు ఆ సావనీర్-" అన్నాడు. "అది నీకు కావాలి కదా" అన్నాడు విశ్వనాథరావు. ప్యూన్ని పిల్చి ఫలానా రిజిస్టర్ తెమ్మన్నాడు. రిజిస్టర్ రాగానే "సర్లే; నేను చెక్ చేస్తాను" అని ఆ ప్యూన్ని బైటికి పంపి 81వ పేజీ చింపేశాడు.

"నీ సఫారీ సూట్ చాలా బాగా కుట్టేడోయ్. మీ టైలరు" అన్నాట్ట ఒకాయన.

"అవును. బాగా కుట్టేడు."

"అతని ఎడ్రస్ నాకు చెప్పు. నేనూ ఒక సఫారీ కుట్టించుకుంటాను."

"అతని అడ్రస్ నీకు చెప్తాను గాని ఒక షరతు. నా అడ్రస్ అతనికి చెప్పనని మాటివ్వు".

(ఎందుకంటే, ఇతను ఇల్లు మారక ముందు కుట్టించుకున్న ఆ సూట్ మజూరీ ఇప్పటిదాకా ఇవ్వకుండా తిప్పించుకు తిరుగుతున్నాడు!) ★

# 91. ప్రభూ, ఏమి సెలవు?

"అనగనగా ఒక ఆఫీసు. దానికొక మేనేజరు. ఆ మేనేజరు కొక చిన్ననాటి స్నేహితుడు" అని పరమేశ్వర రావు ఏదో కథ మొదలెట్టేడు; చాలా రోజుల కిందట ఓనాడు పొద్దుపోయాక, పొద్దుపోడానికి కూర్చున్నప్పుడు.

"గోదారి గట్టుంది. గట్టు మీద చెట్టుంది. చెట్టు కొమ్మన పిట్టుంది" అని పరమేశ్వర రావు కథా కథన ధోరణిని వేళాకోళం చేసేడు వెంకట్రావు.

పరమేశ్వర్రావు ఏ కథ చెప్పదల్చుకున్నాడో తెలియదు గాని సన్యాసిరాజు ఆ "ఎత్తు" - "గడ"ని అందుకుని మాట్లాడేడు; "ఆ చిన్ననాటి స్నేహితుడేమోనూ; తన ఫ్రెండు చిన్నప్పుడు ఎంత పనికిరాని వాడని తిట్లు తిన్నా చివరికి ఒక ఆఫీసుకి మేనేజరు అయినాడు కదా అని సంతోషించి వెళ్ళి అతన్ని అడిగేడుట- "మీ ఆఫీసులో ఎంతమంది పనిచేస్తారూ" - అని! దానికీ మేనేజరు "సగంమంది" అని లకీమని సమాధానం చెప్పేట్ట."

ఈ ఉపాఖ్యానం నాకసలు జ్ఞాపకం రాకపోయేదే. కాని నాకు మొన్నీమధ్య ఒక గవర్నమెంటాఫీసులో పని పడ్డప్పుడు ఆ ఆఫీసుకి మేనేజరుగా నా మిత్రుడు ప్రభాకర్రావు జాయినయ్యాడని తెలియగానే గుర్తొచ్చింది. నాకు ఆ ఆఫీసులో పని పడింది కనుక "మీ ఆఫీసులో అందరూ నిజంగా పని చేస్తున్నారా, లేక సగం మంది సెలవులు పెట్టేసి సగం మంది అటూ ఇటూ పనుల మీద పోయి నిన్ను ఏడిపించుకు తింటున్నారా?" అని నేను ప్రభాకర్రావుని

అడగడం మంచిది కాదు. అంచేత నేను మాటలు నాన్చకుండా నా పనేమిటో చెప్పేశాను.

"సారీ బ్రదర్! ఈ సబ్జెక్టుకి సంబంధించిన గుమాస్తా ('కన్సర్న్డ్' క్లర్క్) సెలవులో ఉన్నాడు.'' అన్నాడు ప్రభాకర్రావు. అని వూరుకోలేదు. లీవు రిజిస్టరు తెప్పించి అతనెప్పుడు జాయినవుతాడో లెక్కకట్టి, ఎందుకయినా మంచిది; నువ్వు సరిగ్గా (అతను జాయినవుతాడని మనం అనుకుంటున్న) పదమూడో తారీకునాడు కాక ఏ పద్నాలుగునో పదిహేన్నో వచ్చి, నిమిషాల మీద నీ పని చేయించేస్తాను.... అలా అని పదహారో తారీకునాడు రాకు. ఆ రోజు ఆదివారం పడ్డది!'' అని నవ్వేడు. "అతను లేకపోతే ఇంకొకళ్లు చెయ్యొచ్చు కదా?'' అని అన్నాను. అలాగ కుదరదన్నాడు.

సరేకదా- అని పదిహేడో తారీఖు సోమవారం చేసి వెళ్లేను. ఆ రోజు ఆ "కన్సర్న్డ్'' గుమాస్తా ఉన్నాడు గాని, నా పనికి సంబంధించిన "స్టాక్ ఫైలు'' నిర్వహించే హెడ్ గుమాస్తా ఆ రోజు సెలవులో ఉన్నాడని తెలిసింది. సంబంధిత గుమాస్తా చాలా "కన్సర్న్డ్'' గా (విచారంగా) మొహం పెట్టి చెప్పేడు. ఆ విధంగా ఆ రోజు కూడా నేను ఆ ఆఫీసుకి ప్రభాకర్రావు అనే చిన్ననాటి మిత్రుడికి (అతనిచ్చిన అరకప్పు టీ తాగడం ద్వారా) ఆనందం కలిగించడానికే వెళ్లినట్టు అయిందిగాని పనిమీద వెళ్లినట్టు అవలేదు.

అలా అలా, జూలై నెల పదో తారీకుని మొదలు పెట్టిన ఒక చిన్న పని ఆగస్టు ఇరవై ఒకటో తారీకు వరకూ అవలేదు. పత్రికలవారి భాషలో చెప్పాలంటే "కేసు వివరాలు ఇలా ఉన్నాయి''-

గుమాస్తా తొమ్మిదో తేదీ నుంచి పదహారో తారీఖు వరకూ సెలవులో ఉన్నాడు. పదిహేడున హెడ్ గుమాస్తా గారు సెలవు పెట్టేరు. 18, 19 నా ఫైలు కంజాయింపు చేశారు కాని, 19 మధ్యాహ్నం సడెన్‌గా ఎమ్.డి.గారు ఈ ఫైల్‌కి అవసరమైన స్టాక్‌ఫైల్ వేరే పనిమీద కావాలని కబురు పెట్టడం వలన అక్కడికి వెళ్లిపోయింది. 20 సాయంత్రం ఎమ్.డీ.గారు "ఆ'' ఫైలు మీద "ఢిల్లీ నుండి రాగానే పుటప్ చేయండి'' అని రాసేయడం వల్ల స్టాక్ ఫైలు ఎమ్.డి.గారి పి.ఏ.గారి దగ్గిర ఆరురోజులు ఉండిపోయింది. స్టాక్ ఫైలుతో ఎమ్.డి.గారి అవసరం తీరిపోయిన మర్నాటి నుంచి పి.ఏ. గారు వారంరోజులు సెలవు మీద వెళ్లిపోతూ దాన్ని లాకర్‌లో జాగర్త పెట్టేశారు. పి.ఏ. గారు మర్నాడు వస్తారనగా తొలిరోజున ప్రభాకర్రావు - హైదరాబాదు నుంచి వాళ్ళ నాన్నగారికి సీరియస్‌గా ఉందని టెలిగ్రాం రాగా సెలవు మీద వెళ్లిపోయి ఆగస్టు 14న వచ్చాడు. 15 సెలవు, 20 సెలవు. 18 నాడు నా ఆర్డర్ పడింది గాని ఈ సెక్షను టైపిస్టు రెండు రోజులు సెలవు పెట్టడం వలన "మరీ అర్జంటూ'', "వెరీ అర్జంటూ'' అనిపించుకోని నా కాగితం ఆ రెండు రోజులూ పడుకోవలసి వచ్చింది.

ప్రభాకర్రావు నా చిన్ననాటి మిత్రుడు కదా. అందుకని లోపల కసిగా ఉన్నా సరే, ఇదేదో సెన్సాఫ్ హ్యూమర్‌గానూ, చనువుకి ఉదాహరణగానూ తీసుకోమన్నట్టుగా నేను అతనికి ఈ "సగం మంది'' జోకు చెప్పేను. దాంతో ప్రభాకర్రావు మరో అరకప్పు టీ రప్పించి అరగంట క్లాస్ తీసుకున్నాడు.

"సెలవు - అనేది ఉద్యోగులు తమ జన్మహక్కుగా భావించకూడదు- అని బ్రిటిష్‌వాడు; మనం ఇప్పుడు పాటిస్తున్న "ఫండమెంటల్ రూల్స్" అనబడే ప్రాథమిక నిబంధనల్లో ఉదాహరించేడు. అయినా సరే; ప్రభుత్వోద్యోగులకీ, ప్రభుత్వ పద్ధతిలో నడిచే కొన్ని ఇతర సంస్థలకీ సెలవు హక్కులు చాలా ఉదారంగానే దఖలు పడ్డాయి.ఒక ఉద్యోగికి 365 రోజులు గల ఒక ఏడాదిలో 15 క్యాజువల్ సెలవులూ, 33 రోజుల ఆర్జిత (ఎర్న్‌డ్) సెలవు, 20 రోజులు సగం జీతం మీద సెలవు; 64 రోజులు శని, ఆదివారాలు సెలవులు, మరో 20 రోజులు పండగలూ పబ్బాలూ రావడం వల్ల సెలవులు. మొత్తం 152 సెలవులు ఉంటాయి. శని, ఆదివారాలు రెండూ సెలవులుగా ఉండే ప్రభుత్వ శాఖల్లో ఇది 180 దాటుతుంది. అంటే ఏమన్న మాట? మీ ఆఫీసులో ఎంతమంది పనిచేస్తున్నారు అన్న ప్రశ్నకి 'సగం మంది' అనే జవాబు కరెక్టయినదనే చెప్పాలి. ప్రపంచం మొత్తం మీద ఏ రంగంలోనూ- అంటే విజ్ఞానం, అక్షరాస్యత, ఆఖరికి స్పోర్ట్సు, దేంట్లోనూ కూడా మన దేశానికి ప్రథమ స్థానం లేనందుకు సెలవులు ఇచ్చుట, పుచ్చుకొనుట అనే దాంట్లో మనం ఫస్ట్ అని సగర్వంగా చెప్పుకోవచ్చు. మనం జనవరి ఫస్టుకీ ఉగాదికీ కూడా సెలవుల ఇచ్చుకోగలం. సంకురాత్రికి, శివరాత్రికీ దీపావళి రాత్రికీ ఇచ్చుకోగలం. వినాయక చవితికీ నాగుల చవితికీ ఇచ్చుకోగలం. కృష్ణుడి పుట్టిన రోజుకీ రాముడు పుట్టిన రోజుకీ మహమ్మదు పుట్టిన రోజుకీ గురునానక్ పుట్టిన రోజుకీ బుద్ధుడు పుట్టిన రోజుకీ గాంధీ పుట్టిన రోజుకీ అంబేద్కర్ పుట్టిన రోజుకీ సెలవులు ఇచ్చుకోగలం. స్వాతంత్ర్య దినానికి, రిపబ్లిక్ డేకీ, మేడేకీ కూడా సెలవులు ఇచ్చుకోగలం. అలా అని ఆదివారాలు, శనివారాలు వొదులుకోం. ఇంత ఔదార్యం ఇంకే దేశంలోనూ కూడా ఉండదని నా ఉద్దేశం. 'సెలవు - సిస్టమ్' వల్ల మేన్ - పవర్‌కి మౌలికంగా కలుగుతున్న నష్టం సంగతి అలా ఉంచితే సెలవుకి ముందు రోజునా మరుసటి రోజునా వచ్చే హాలిడే మూడ్, హాంగోవరూ మరి కొంత నష్టం కలిగిస్తున్నాయి."

నా పని మీద ప్రభాకర్రావు ఆఫీసుకి మొత్తం ఐదుసార్లు వెళ్లేను. అయిదు సార్లూ ప్రభాకర్రావు నాకు టీ రప్పించి ఇచ్చేడు. కాని ఈ ఆఖరి అరకప్పు టీ మహా చేదుగా ఉన్నట్టు అనిపించింది. దానికి కారణం "అతను అన్నదంతా నిజం; నిజం చేదుగా ఉంటుంది" అని కొంతసేపు అనుకున్నాను. కాని, అసలు కారణం వేరు; పని అయిపోయాక ఉపన్యాసాలు వినడం మహాదుర్భరం; అని తరువాత తెలిసింది.

"ఉద్యోగులు సెలవు మీద దీర్ఘకాలం వెళ్లి పోకుండా ఉండాలన్న ఉద్దేశంతో సెలవును డబ్బుగా మార్చుకోవడం అనే పద్ధతి ఒకటి వచ్చింది. దీంట్లో జోక్ ఏమిటంటే; "నువ్వు సంపాదించిన సెలవుకి మింజుమలే నీకు డబ్బు చెల్లించడానికి అభ్యంతరం లేదు; కాని, అలా డబ్బు పొందుతున్న ప్రతి సందర్భంలోనూ నువ్వు ఓ వారం రోజులపాటు సెలవు మీద వెళ్ళి తీరాలి సుమీ!" అని ప్రభుత్వమే అనుబంధ నిబంధన పెట్టింది!" అన్నాడు ప్రభాకర్రావు.

"ఒస్తానోయ్, ప్రస్తుతానికి సెలవిప్పించు" అని లేచాను.

★